# కురింజి

**- గొల్లపూడి మారుతీరావు**

ప్రతి సంవత్సరం కొడైకెనాల్ యాత్రలో నన్ను ఆకర్షించే విషయం ఆ నేపాలీ వంటవాడి భోజనం. మా మిత్రుడి గెస్ట్‌హౌస్‌లో తెనాలి వంటలు వండి పెట్టే "వినోద్" విందు ఆ పది రోజులూ పండుగని చేస్తాయి. గుత్తివంకాయకూర, కందిపప్పుపచ్చడి, ఉల్లిపాయపులుసు, పెసరట్టు, మసాలా దోశె, ఆవపెట్టినకూరలూ, ఇంకా వెజిటెబుల్ పులావు, బిసిబిళబాత్, వెజిటెబుల్ మంచూరియా- మీ యిష్టం, ప్రతీ రోజూ ఉదయం వంట రుచులు చూడడానికి లేస్తాను. వెనక తోటలో కాలిఫ్లవర్ నాచేత కోయించి- నా కళ్ళముందే వండి నా మతి పోగొడతాడు. సంవత్సరం పొడువునా - పదిరోజుల కోసం ఎదురుచూస్తాను.



"నువ్వు కాపరాలు చెడగొడతావయ్యా మీ వంట తిన్నవాళ్ళు పెళ్ళాల్ని వదిలేసి నీ దగ్గర సెటిలయి పోతారు- తిండికోసం" అంటే వెన్నెల కురిసినట్టు నవ్వుతాడు- నేపాలీ తెలుగులో మురిసిపోతూ.

గెస్ట్‌హౌస్‌కి రెండు కిలోమీటర్ల దూరంలో మురుగన్ ఆలయం. అన్నీ కొండలు- ఎత్తుపల్లాలు కనక సగం మీదకి నడవాలి, సగం కిందకి దొర్లాలి. - ఆలయం పేరే "కురింజి ఆండవర్" పన్నేండేళ్ళకి ఒకసారి పూచేపువ్వు- కురింజి. అరుదయిన పువ్వు ఆ చెట్టు ఆలయంలో ఉంది. పక్కనే క్రితం సారి పువ్వు పూచిన సంవత్సరం రాసి ఉంచుతారు. నేను పువ్వులు పూసిన సంవత్సరం వెళ్ళాను. చాలా అందమైన పువ్వు అతి సున్నితమైన సువాసన. లేత ఊదారంగు రేకులు- మంచు ఉదయాన పెళ్ళున లేచిన సూర్యరశ్మి లాగ పరిమళిస్తుంది.

నేనిక్కడ ఎవరికీ తెలియదు. లేదా చూచాయగ కొందరికి తెలుసేమో, కాస్త అనుమానంగా, వింతగా చూస్తారు. చార్లెస్ శోభరాజును కోయంబత్తూరులో చూసినట్టు. అప్పుడప్పుడు తెలుగు టూరిస్టుల ముఖాలు, ఒక్కసారి వికసించి గొల్లుమంటాయి. కొడైకి దగ్గరలోనే "పెత్తల గుండు" దగ్గర మా డ్రైవరు ఊరు. నన్ను కొడైలో దింపి కారు అక్కడే వదిలేసి ఇంటికి పొమ్మంటాను. ఇన్నిసార్లుగా వస్తున్న మాకు కొడైలో పెద్దగా చూసేదిఏమీ లేదు. సాయంకాలం మా ఆవిడను బతిమాలి రెండు కిలోమీటర్లు నడిపిస్తాను. ఎత్తు రోడ్డు నడిచినంతసేపు నన్ను తిట్టుకొని, పల్లం దిగినప్పుడల్లా దేవున్ని పొగుడుతూ ఉంటుంది. ఏమైనా తిరిగి వచ్చే సరికి ఇద్దరమలసిపోతాం. తొందరగా కొడైలో చీకట్లు ముసురు కుంటాయి. మళ్ళీ వినోద్ భోజనానికి నిరీక్షణ- నిద్ర.

కురింజి ఆండవర్ ఆలయం దగ్గర,ఓ పూల దుకాణం. నల్లగా తుమ్మమొద్దులాగ వుండే యజమాని. మమ్మల్ని చూడగానే నవ్వుతూ పూల సెజ్జని అందిస్తాడు. అందులో కొబ్బరికాయ, పళ్ళు, పూలు అమరి ఉంటాయి. అయినా మాకోసం స్వచ్ఛమైన పువ్వుల్ని మారుస్తాడు. ఆ "నవ్వు" ప్రత్యేకంగా మాకోసమేనా? లేక వ్యాపారి "నమూనా" నవ్వా? అని మొదట లెక్క చేయలేదు. సరుకులమ్మే ప్రతీ వ్యాపారికి చిన్న ట్రేడ్‌మార్క్ ఉంటుంది. కాగా, ఇతనికి నాపేరూ, నా వేషాలూ తెలిసే అవకాశం లేదు. ఏమైనా తెలుగు బస్సులు ఆగడం, తెలుగు నవ్వులూ, రకరకాల కెమెరాల మెరుపులూ- కాస్త నా గురించి పసిగట్టాడేమో, క్రమంగా అతని నవ్వు విశాలమైంది. నా పరపతి ఎరిగా? లేక పరిచయం పెరిగా?

ఆలయం చేరేసరికి మా ఆవిడ రొప్పుతూ డ్రైవరుని పంపివేసిన నన్ను తిట్టుకుంటూంటుంది. ఈ పూల యజమాని పరుగున మా దగ్గరికి వస్తాడు. చక్కటి తమిళంలో "అమ్మా!వాంగో!" అని ఆహ్వానిస్తాడు నాకు కాస్త ఊరట. అప్పుడే వచ్చిన పూలని అలంకరించి సజ్జని చేతికందిస్తాడు. ఓ మల్లె చెండుని తుంచి, మా ఆవిడ చేతికిచ్చి "ఇది తలలో పెట్టుకొని ఆలయంలోకి అడుగు పెట్టండమ్మా" అంటాడు. అంతే, మా ఆవిడకి "కురింజి అండవర్" అక్కడే ప్రత్యక్షమైనంత సంబరం. ఆవిడ భర్త నైనందుకే నా మీద గౌరవం. లేదా నా భార్య అయినందుకు ఆవిడకి మర్యాదా? ఏమయినా పరపతికి, పూలచెండుకి పొంతన లేదు.

క్రమంగా- ఆలయం సమీపిస్తూనే- ఆ చింతమొద్దు కోసం చూడడం అలవాటయిపోయింది. ఆ శరీరాన్ని మరిపించే మర్యాద, మప్పితం, ఆర్ద్రత ఆ నవ్వులో. చిన్న పూలచెండు- అందరి సంగతియేమోగాని- మా ఆవిడ యిచ్చినంత డబ్బు తీసుకుంటాడు. దాని వేపు చూసినట్టయినా కనిపించడు. నాకే కాస్త యిబ్బంది అనిపించి "మరో అయిదు రూపాయలు ఎక్కువ యియ్యి" అని మా ఆవిడని గోకుతాను.

కురింజి అండవర్, పూల యజమాని- మాకు క్రమంగా ఎదురుచూసే రొటీను అయిపోయింది. ఒక్కోసారి అతను ఉండడు. దుకాణాన్ని తప్పించుకుందా మనుకుంటే అక్కడ వుండే కుంటి కుర్రాడు అడ్డం పడతాడు. అతని పెదాలకు తొర్రి. ఆపరేషన్ చేసి కుట్లు వేశారు. తమిళం సరిగా అర్థం కాదు. కాని అంతే భక్తిగా పూల సెజ్జని అందిస్తాడు.

"మర్యాద" పెద్ద అంటువ్యాధి. అలవాటు పడితే వదిలిపెట్టదు. ఓ రోజు దారిలో వర్షం పట్టుకుంది. తలదాచుకునే చెట్లు లేవు. ఇద్దరం తడిశాం. ఆలయానికి మలుపు తిరిగితే అల్లంత దూరంలో మమ్మల్ని కనిపెట్టి రెండు గొడుగులతో పరుగున వచ్చాడు. భక్తిగా మా ఆవిడకి గొడుగు అందించి నా గొడుగు తను పట్టుకు నా వెంట తనే నడిచాడు. తడిసిన మా బట్టలు చూసి "నాకు చాలా బాధగా వుందయ్యా" అన్నాడు. ముఖం చిన్నబుచ్చుకొని. దర్శనం అయి,వర్షం తగ్గే వరకూ రెండు బల్లలు వేసి కూర్చో పెట్టాడు. అప్పుడు తెలిసింది కుంటికాలు కుర్రాడు అతని తమ్ముడని. ఇద్దరికీ వయస్సులో వార. ఒక్కొక్కప్పుడు ఇద్దరూ దుకాణం దగ్గర వుంటారు. మమ్మల్ని చూసి ఇద్దరూ రెండు వేపులకి పరుగెత్తుతారు.

నా గొప్పతనానికో, పరపతికో ఈ మర్యాద దక్కు తోందనిపించి భుజాలు రహస్యంగా పొంగాయి. ఓసారి ఆపుకోలేక అడిగాను "నా సినిమాలు చూశావా?" అని. ఆ శరీరానికి ఎంత పరిపూర్ణమైన నవ్వుని అతికించాడో దేవుడు! పక్కున నవ్వాడు. ఆ నవ్వుని "చూడలేదు" అని తర్జుమా చేసుకున్నాను. అతని మీద గౌరవం మరింత పెరిగింది.

"వాడు పుణ్యాత్ముడు. వాడికి జన్మలేదు" -ఇది మా ఆవిడ ఎల్లప్పుడూ అతనికిచ్చే కితాబు.

రిబేటు ధరకి- లేదా- ధర ప్రమేయం లేకుండా పూల సెజ్జ అందించి అతనెంత నష్టపోయాడా అని నాకనిపిస్తూంటుంది.

చెన్నై బయలు దేరే రోజు దగ్గరికొచ్చేసింది.

"రేపు ఊరికి బయలు దేరుతున్నాం" అన్నాను.

"ఉండండు"సార్ అని పక్కనే ఉన్న తమ్ముడి చెవులో ఏదో చెప్పాడు. పక్క దుకాణంలో ఎండు ద్రాక్షపళ్ళ పేకెట్ తెచ్చాడు కుంటి తమ్ముడు. రోడ్డు మీదే మా ఇద్దర్నీ పక్కపక్కన నిలబడమని- సాష్టాంగ పడమన్నాడు తమ్ముడిని.

"వీడికి ఆగస్టులో పెళ్ళయ్యా- దీవించండి"అని.

ఇద్దరికీ కళ్ళనీళ్ళ పర్యంతం అయింది. సంప్రదాయం పట్ల వాడి మక్కువ, పెద్దల మీద గౌరవం, సుమంగళి తలనిండా పువ్వులు పెట్టుకు స్వామి దర్శనానికి వెళ్ళాలనే పట్టింపూ- ఆర్ద్రమైంది. మా ఆవిడ పర్సందుకొని ఓ వంద రూపాయ నోటు చేతిలో పెట్టబోయాను. ససేమిరా వద్దన్నాడు. "మీ దీవెన చాలయ్యా" అదీ మాట.

కారెక్కుతుండగా మూడేళ్ళుగా ఓ విషయం తెలుసు కోలేదని గుర్తుకొచ్చింది.

"ఒక్క నిముషం" అని వెనక్కి నడిచాను. మా ఆవిడ ఆశ్చర్యంగా చూస్తోంది.

పూల దుకాణం దగ్గరకెళ్ళి అతన్ని అడిగాను "నీ పేరెన్నప్పా!"

కంచి కామకోటి పీఠాధిపతి చంద్రశేఖర సరస్వతికి ప్రణామం చేసినట్టుగా రెండుచేతులు జోడించి అన్నాడు.

"మీర్ అయ్యా- మహమ్మద్ మీర్ ఆలం"

(ఇది కథ కాదు, కొడైకెనాల్ వెళ్ళినపుడు- కురింజి అండవర్ ఆలయానికి కుడిపక్కన పూల దుకాణం దగ్గర అతన్ని చూడవచ్చు)